గెర్డ్ గేసర్

# 6. ఆకుపచ్చ లేడి చర్మం

తెరెసా — అప్పుడే ఇంచుమించు ముదిరిపోయింది; పేరు కుదించి రెసా, రెస్ అనికూడా ఆమెను పిలుస్తుంటారు. ఆమె చెల్లెలు విన్నీ ఆమెకన్నా ఎంతో చిన్నది — కూతురులాగుంటుంది అని చెప్పలేంగాని, అక్క-కూతురులాగైనా కనిపిస్తుంది. రెస్ విన్నీతో అంటుంది. "జాకెట్ నీకు బాగానే సరిపోయింది. అసలు నా సైజు అయినా నీకు సరిపోయింది."

రెసా ఇప్పుడిల్లా అంటుందిగాని, దుకాణంలో ఇది తొడుక్కు చూసినప్పుడు తనలో అనుకుంది, "చాలా బాగుంది. అయితే నాబోటివాళ్ళకి సరిపోదు ఇది." విన్నీతో మాత్రం, పెద్దరికం సూచిస్తూ, "విన్నీ నీ కింకా ఇది సరిపోదు. కొంచెం వొళ్ళుచేసి మనిషివి కావాలి," అంది. అంటూనే, విన్నీ తొడుక్కున్న జాకెట్ విప్పేసింది. దురుసుగాకాదు, అంత సుతారంగానూ కాదు.

అయితే, ఈలోగా, అసందర్భం ఒకటి ఏర్పడింది. పోలీసులు తెరెసా విషయంలో కొంత కలుగజేసుకోవలసి వచ్చింది. పోలీసులు ప్రవేశించారు, మర్యాదగా, మంచితనంగా, లౌక్యంగా. అసలు వయోమ్స్ నగరమే లౌక్యానికి పెట్టింది పేరు. "నువ్వూ మేమూ ఒక రాజీ కొద్దాం. ఈ గొడవంతా రెండోకంటి వాడికి తెలీకండా సర్దేశేద్దాం," అన్నారు వాళ్లు.

లేడిచర్మం, ఆకుపచ్చ లేడిచర్మం, ముదురాకుపచ్చ. రెసా చట్టానికి ఎదురుగా నిలబడి ఉంది. ఇంకా చట్టానికి ఎదురుగా రాలేదు. ప్రస్తుతం పోలీసులికి ఎదురుగా నిలబడి ఉంది. పోలీసు లామెను కూర్చోమని కూడా అన్నారు. రెసా ఒక వస్తువు తీసుకుంది, ఆకుపచ్చ చర్మంతో కుట్టిన జాకెట్టు. ఇప్పుడది తిరిగి ఇచ్చెయ్యాలి. రెసా కిది అలవాటే. ఈసారి మాత్రం తీసుకోడం మానేస్తే, ఇవ్వడం

కూడా తప్పేది. అయితే ఇప్పుడు వస్తువును ఇచ్చెయ్యక తప్పదు. తాత్కాలికంగా నైనా, పోలీసు ఎంత మెత్తగా ఉన్నా, తప్పదు.

ఈ పెద్ద దుకాణాల్లో దొంగతనా లుంటాయి. ఒక దొంగతనం జరిగితే పెద్ద అల్లరి జరగవలసిన అగత్యం లేదు. పదిమందికీ ప్రచారం కానక్కరలేదు. కాని శిక్షమాత్రం పడుతుంది. అయితే శిక్షమాత్రం కొంతవరకూ ఆ వ్యక్తిమీద ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే, దుకాణాల్లో దొంగతనం చేసి పట్టుబడ్డవాళ్ళలో కొందరు, అసలు అటువంటి పని చెయ్యగలరనీ, చేస్తారనీ ఎవరూ అనుకోరు. రెసా విషయంలో బహుశా పెద్ద అల్లరి జరిగి ఉండేది కాదేమో. ఆమెను ఎరిగున్నవాళ్లు బహుకొద్దిమంది. అయితే ఆమె చేస్తున్న ఉద్యోగం దృష్ట్యా కొంత అల్లరి తప్పదేమో. ఎందుకంటే, ఆమె పనిచేస్తున్న ఆఫీసు పదిమందికీ తెలిసినది. మంచి జీతా లిస్తారక్కడ. అందుకనే మంచి నిజాయితీ గల వ్యక్తుల్నే ఏరుకుంటారు. అయితే, టెరెసా, 'గెఫ్‌జాన్' అనే పెద్ద దుకాణంలోనించి ఖరీదైన జాకెట్టు, చర్మంతో చేసినది, ఆకుపచ్చ రంగుది, సంగ్రహించింది. ఆమె సంగ్రహిస్తుండగా ఎవరూ చూడలేదు. ఆమె దాటుకుపోయేదే. అయితే దుకాణం అవతల ఈమెకోసం వేచివున్న మరొక స్త్రీవ్యక్తి ఒక చిన్న పొరబాటు చేసింది. రెసా వచ్చేదాకా ఆగకండా కారు తోలుకుపోయింది. కాస్త ఒకచుట్టు చుట్టివద్దామని పోయిందో, భయపడే పారిపోయిందో. అంచేత రెసా అక్కడ నిలబడవలసి వచ్చింది. దొరికిపోయింది. కాదనలేక పోయింది. దుకాణం యజమానులు పోలీసులికి అప్పజెప్పారు.

అసలు ఆ సంస్థని 'దుకాణం' అని పిలుచుకోటం ఒక లజ్జు ఏడంతస్తుల భవనాన్ని 'కుటీర' మన్నట్టు. ఎక్కువదాన్ని తక్కువచేసి చెప్పడం ఒక ఫాషను. అది బ్రహ్మాండమైన సంస్థ. అతి అపురూపమైనవీ, సామాన్యంగా దొరకనివీ మాత్రమే అక్కడ అమ్ముతారు. సంధి అమలు జరపడానికి వచ్చిన విదేశీ అధికారులంతా కావలసిన సరుకులన్నీ అక్కడే కొనుక్కుంటారు. వాళ్ళందరికీ ఈ రకం దొంగతనాల్ని గురించి బాగా తెలుసు. ఇలాంటి దొంగతనాలు చేసేవాళ్ళు అవసరంకొద్దీ చెయ్యరు. ఈ చేవాడితనానికి వాళ్ళ స్వభావాల్లో ఎక్కడో చిన్న మెలిక లుంటాయి. వాటిని నిశితంగా పరీక్షిస్తే ఇబ్బందు లున్నాయి. అంచేత చెయ్యరు. ఇలాంటి దొంగతనాల్ని క్షమాదృష్టితో చూడ్డానికి, ఏదో అవసరం

కొద్దీ దొంగిలించాడంటే చాలదు. కొన్ని దొంగతనాల విషయంలో యీ సంస్థ యజమానులు, లోపాయికారీ సర్దుబాట్లు చేసుకున్నారు. అయితే ఈ మెత్తదనానికి ప్రతిఫలంగా దొంగతనాలు ఎక్కువయాయి. అంచేత ఈ మధ్య దొంగల్ని అరెస్టు చేయించడానికి యజమానులు నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయాన్ని అనుసరించి-కొంత అయిష్టంగానే-రెసాని పోలీసులకు అప్పగించారు.

రెసా, తనను గురించిన వివరాలన్నీ ఇచ్చింది, వయస్సు, ఉద్యోగం వగైరా. సంధి ప్రభుత్వాల వ్యాపారశాఖలో ఉద్యోగం. ఆమె పర్సులో దొంగిలించబడ్డ వస్తువును కొనడానికి తగినంత డబ్బు ఉంది. డ్యూటీలో ఉన్న పోలీసు అధికారి, అతిమర్యాదగా, స్నేహపూర్వకంగా మాట్లాడాడు.

ఇటువంటి ముద్దాయిలను చూడగానే పసిగట్టగల డతను. వ్యవహారం పరిష్కరించడానికి షరతులు వివరించాడు. తన సొంతలాభంకోసం బేరమాడుతున్న ధోరణిలోనే వివరించాడు.

"మనం ఒకలాగ రాజీచేసుకుందాం," అన్నా డతను. "తుని తగువు చేసుకోడానికి మా కిష్టమే. ఈ వ్యవహారం బయటికి పొక్కవలసిన అవసరంలేదు. ఒకటి రెండు చిన్న షరతులు మేం పెట్టక తప్పదనుకోండి"

షరతు లేమంటే : దొంగిలించబడిన వస్తువును కొనాలి—అయితే ఆఫీసరు 'దొంగిలించబడ్డ' అని స్పష్టంగా మాత్రం అనడనుకోండి – వస్తువుయొక్క విలువ దుకాణ యజమానులకు ఇవ్వాలి, డబ్బురూపంగా. అల్లాగే – డబ్బురూపం లోనే, వస్తువు విలువకు సమానమైన మొత్తం వియన్నా రెడ్‌క్రాస్ సంస్థకు విరాళంగా ఇవ్వాలి. దానికి రశీదు ఆమెకు ముడుతుంది. పోలీసు పుస్తకాల్లో ఆమె పేరెక్కదు. ఆమెమీద అభియోగం ఉండదు.

ఆకుపచ్చ లేడిచర్మం. ముదురు ఆకుపచ్చ, పోలీసు స్టేషన్ బల్లమీద ఉంది, వింతవస్తువులాగ. అక్కడ కాదు దాని స్థానం. కదలికలేని ఆఫీసు వాతావరణంలో సువాసలు విరజిమ్ముతోంది. మెత్తని – ముదురాకుపచ్చ లేడిచర్మం, వేలుపెట్టి నొక్కితే ముద్రపడుతుంది దానిమీద, ముఖమల్‌మీదలాగ. టెరెసా! నీకెందుకిది? లేక, నీకే కావాలా? లేడిచర్మం. ఆఫీసరుకి మంచి ఓర్పుంది. ఆమెను ఇరుకున పెట్టడు, నిర్బంధించడు. టెరెసాకి గత్యంతరం లేదని అతనికి పూర్తిగా తెలుసు. వెంటనే ఆమె సమాధానం చెప్పలేదు. అతను కిందపెట్టిన పెన్ తీసుకుని ఒక

ఫైల్ తీసి చదవడం మొదలుపెట్టాడు. రెసాకు కాస్తవ్యవధి దొరికింది. ఆలోచించు కోడానికి.

ఆ దూరదేశం. ముదురు ఆకుపచ్చ దేశం. దాన్నిగురించి రెసా ఎన్నో కలలుకంది. పచ్చని చెట్లూ, లేళ్ళూ, దుప్పులూ ఉండే దేశం. చిన్నతనంలో కలలవన్నీ. ఇప్పుడదంతా గతచరిత్ర. ఇప్పుడు ఈ సమర్థుడైన, చురుకైన పోలీసు అధికారితో రాజీపడకూడదని ఒక విషపు కోరిక. బరితెగించి, లక్ష్యపెట్టకండా అతన్ని ఎదిరించాలి. పదిమందిలో అవమానించబడాలి. అవమానకరమైన వియోం కోర్టులో దొంగగా పరాభవించబడాలి. తన్ను గురించిన వివరాలు — వయస్సు — ఉద్యోగం — తరవాత, పోలీసు చిత్తాలోకి ఎక్కని వివరం — కలల బందిఖానాలో చిరకాలావాసం, ఆ తరవాత కలలకు తావేలేని పరిస్థితుల కారాగారంలో బందీ. క్షణం వరకూ, వయసు మళ్ళిన కన్యనైపోయానని గుర్తించుకుందామె. ఆమె తల్లి వయస్సు ముదిరిన తరవాత మరొక బిడ్డని కంది. ఆ తరవాత జబ్బుపడింది. చచ్చి పోయింది. ఆ బిడ్డ రెసా దగ్గరుంది. ఆ బిడ్డగాక ఇంకా ఇద్దరు తమ్ముళ్ళున్నారు. అంచేత నిజం చెప్పాలంటే, బిడ్డల సంరక్షకురాలు. ఒక రోజున, అవతల గదిలో వాళ్ళిద్దరూ పాఠాలు చదువుతుంటే ఆమె వింది.

"రెస్, రాఫె[1] అయిపోతుంది.'' అన్నాడొక తమ్ముడు.

'రాఫె' మద్యం తయారుచేసే వాళ్లుపయోగించే మాట. తీపంతా పోయిం తరవాత మద్యాన్ని 'రాఫె' అంటారు. తీపీ ఉత్సాహం ఉడిగిపోయిన మనిషి రాఫే.

"రెస్, రే, రే, రెమ్." వ్యాకరణం వల్లించాడొక తమ్ముడు.

"స్పెస్, స్పే, స్పెమ్.'' అని వల్లించా డింకొక తమ్ముడు. "అంటే, ఆశ వదులుకోవాలని అర్థం."

మొదటి వాడన్నాడు, "ఒరేయి, రెస్ స్త్రీ లింగమేగాని, ఒక్క వ్యాకరణ సూత్రంలోనే—రెస్, రే, రే, రెమ్ అన్నప్పుడు మట్టుకే. తక్కిన సందర్భాల్లో రెస్ నపుంసకలింగం."

"నపుంసకం."

---

[1] జర్మన్ భాషలో పదాలను మూడు విధాలుగా చమత్కరించవచ్చు. (రెస్, రే, రాబ్) మరో భాషలోకి యీ చమత్కారాన్ని తర్జుమా చెయ్యడం అసంభవం. రాఫె—అంటే ముందుగా పండిపోయిన—అని అర్థం.

"అంటే, ఆడా మగా కాదన్నమాట.''

టెరెసా నిశ్చలంగా నిలబడింది. ఎందుకో మందలించి, ఈ సోమరిపోతులికి కోపం తెప్పించింది. మరి వాళ్ళని మందలించాలా వద్దా ? సోమరిపోతులు: మంచీ మర్యాదా ఎరగని తుంటరులు, అనుకుందామె. పొడిపొడిగా ఏడ్చింది— బల్లమీద చెంచాలు పెడుతూ. నేను మీకు వండిపెట్టాలి. నానాచాకిరీ చెయ్యాలి. నన్ను వ్యాకరణం చేసి వల్లిస్తారు మీరు. నపుంసకలింగం. అందరికన్నా ముందర పుట్టడం నా తప్పా ?

తన్ను గురించిన వివరాలు: పడ్డకష్టాలకు ప్రతిఫలంగా వాళ్ళిద్దరూ వాళ్ళ కాళ్ళ మీద నిలబడాలి—చిన్ని చెల్లెలు తప్ప. ఆంతవరకూ రెసా ఏదో మామూలు తరహా ఉద్యోగంలో స్థిరపడక తప్పలేదు. ప్రత్యేకమైన ట్రయినింగయి పెద్ద ఉద్యోగాలు సంపాదించే అవకాశం ఆమెకు లేకపోయింది. బాగా పని చేస్తుంది. ఆవేశ పడకండా ఆలోచిస్తుంది. క్షణం వృథా చెయ్యదు. విదేశాంగశాఖలో చాలా తొందరగా పైకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి కాస్త మెరుగే బాగా వుందని కూడా అనొచ్చు. చిన్నిచెల్లెలు తన్నిప్పుడు అంతగా బాధించడం లేదు.

అబ్బే, బాధేం లేదు. విన్నీ పావురం ఈకలాగ తేలిపోయే రకం. తేలిక యిన స్వభావం. బరువుగా ఈదుకుంటూ పోయేరకం కాదు. కుళ్ళు ఏ కోశాన్నీ లేదు. ఏమీ శ్రమ పడకండా పరిస్థితులకు అలవాటు పడగలదు. సులభంగా గ్రహించగలదు. ఈ మధ్య రెసాతోటే ఉంటోంది. ఒక ఫాషన్ స్కూల్లో పని నేర్చుకుంటోంది. వియోమాలో కొత్త ఫాషన్లు అభ్యసిస్తోంది. ఇంటి జమా ఖర్చులు రెసా చూసుకుంటుంది. తన బతుకు జమాఖర్చులుకూడా తేలిపోయాయి. తనను అందరూ విన్నీ పిన్నమ్మని అనుకుంటున్నారని విన్నప్పుడే అవి తేలి పోయాయి. పోనీ, పిన్నమ్మయితే మటుకేం పోయింది ? ఆమె గుటక మింగింది. అయితే విన్నీ యింట్లో హడావిడిగా ఇటూ అటూ తిరుగుతుంటే బాగుంటుంది. విన్నీ చలాకీ పిల్ల. మహా సరదా అయినది. కులాసాగా ఉంటుంది, కొంచెం ఖర్చు ఎక్కువైనా అల్పసంతోషి విన్నీ. ఆమెకు హాయిగా ఇవ్వొచ్చు ఎలాంటి బహుమానమన్నా. రెస్ ఆమెతో కలిసి యాత్రలు చేస్తుంటుంది. తన కారిస్తుం దామెకు. స్నేహితుల్ని పిలుస్తుంది. అంతకు ముందెప్పుడూ పిలవాలనిపించ లేదు. ఇప్పుడు పిలవకండానే వొస్తున్నారు స్నేహితులు.

విన్నీ అడుగుతుంది వేస్‌లో పువ్వుల్ని చూసి.

అది చూసేసరికి ఆమె కర్థమౌతుంది ఎవరో వచ్చివెళ్ళారని.

"ఎవ రొచ్చారు ?"

"ఫాల్నర్," అంటుంది రెసా పొడిపొడిగా. "నిన్ను గురించి అడిగాడు".

"ఫాల్నరా. పాపం. నే నింట్లో లేనప్పు డొచ్చాడు," అంటుంది విన్నీ.

రెసా ఇంకేమీ అనదు. కదలదు కూడా. చేతులో సిగరెట్టు పెట్టిమాత్రం పరపరమంటుంది. వొంగిపోయి దాని ఆకారం మారిపోతుంది. నిటాగ్గా, స్కర్ట్, బ్లౌజ్ మీద బెల్ట్ బిగించి కూచుని ఉంటుంది. విన్నీ ఆమె నేమీ పట్టించుకోదు. బెల్టు వదులుచేసుకుని పొట్టిచేతుల కోటులో ఇటూ అటూ గదిలో పచారుచేస్తూ అక్కగారిమీద జాలి విరజిమ్ముతుంటుంది. ఉన్నట్టుండి, రెసా, సూటిగా తీక్ష్ణంగా, అధికారపూర్వకమైన గొంతుతో అడుగుతుంది, "అయితే శ్రీ శ్రీ ఫాల్నర్ నీ కోసమే ఇక్కడికి వచ్చాడన్నది తథ్యమంటావు."

విన్నీ ఆగుతుంది. గదిలో పచార్లు మానేస్తుంది. ఊరికే నిటాగ్గా నిలబడు తుంది. అక్కగారి ధోరణి ఆమెకు అంతుపట్టదు. ముఖం ఎర్రబడుతుంది. వేలెడు లేదు, ఈ చంటిదానికి తనమీద ఎంత నమ్మకం ! అంచేత తనేదైతే అనదలచుకో లేదో అది అనేస్తుంది, "అది తథ్యమనుకోడం పొరబాటు."

ఆమెగొంతు ఇంక ఆమె స్వాధీనంలో ఉండదు. ఆమె లేచి గది అవతలికి వెళ్ళిపోతుంది, చేతులో నలిగిపోయిన సిగరెట్టుపెట్టెతో. సిగరెట్టుపెట్టి, అనుకుం టుంది తనలో తను ఉక్రోషంగా. పెట్టా ? అనుకుంటుంది తనమీద తనకే చటుకుని కోపం వస్తుంది. తథ్యం ! ఏదీ తథ్యం కాదు. నా పనై పోయిందా ? నపుంసకలింగం. ఆ కుర్రదా ? ఆ చంటిది, నా చెల్లెలు. తనమీది కోపం లోలోపల ఉవ్వెత్తుగా లేస్తుంది. తన వెనకాల తలుపు దఢేలుని మూస్తుంది. కాస్త కృత్రిమ అలంకారం చేసుకుని బయట కొచ్చిన తరవాత అనుకుంటుంది. ఏమిటీ పిచ్చి నాకు ? అని. కిందికి దిగి కార్లో కూచుని, వెనక్కు చూసే అద్దం తనవేపు తిప్పుకుని ముఖం చూసుకుంటుంది. తల వెనక్కి విసిరి అనుకుంటుంది, "నాకేం పిచ్చి లేదు, పిచ్చేమిటి ? ఎందుకు పిచ్చి ?"

ఈ చిన్ని సంఘటనను గురించి మళ్ళీ ఎవరూ ప్రస్తావించరు, ఏమీ మార్పు ఉండదు. రేసా రోజూ తన కార్లో చెల్లెల్ని ఫాషన్ సంస్థదగ్గర వొదిలేసి ఆఫీసుకు

పోతుంది. విన్నీ, బహుశా కొంతసేపు ఆమె మనస్సు పీకుతుందేమో. తప్పుచేసినట్టు ఊరుకుంటుంది. బహుశా అందువల్లనేమో, రెసా కాస్త పెద్దరికం ధ్వనించేలాగ మాట్లాడుతుంది. విన్నీ తనకి ఎదురుతిరగాలని ఆమె ఉద్దేశం కాదు. తనకీ ఆమెకూ మధ్య కాస్త దూరం ఉందని సూచించడం కోసం. కొంచెం చిరాకైనదే. కాని అవసరమైనది, అవసరమా ? పాపం ఆ చిన్నారిమీద కోపగించడం ఎవరికిష్టముంటుంది ? ఉన్నవ్యక్తికే మరింత లభిస్తుంది. అయినా ప్రతివ్యక్తీ తనవంతు రావాలని ఆశపడ్డం సహజం.

"మూడువందల అరవై రెఫిన్లు," అంటాడు పోలీసు అధికారి, ఏదో బేరమాడుతున్నట్టు. "ఇదుగో బిల్లుకి రశీదు. దుకాణదారుకి. ఇది రెండో రశీదు. మొత్తం ఏడువందల ఇరవై రెఫిన్లు. ఇంకే ఖర్చులూ కలపలేదు. వ్యవహారం దీనితో పరిష్కారమైపోతుంది."

"మూడువందల అరవై రెఫిన్లు," అంది. దుకాణంలో అమ్మకాలు చూసే అమ్మాయి. ఆ అమ్మాయి అందరూ దుకాణాన్ని "గెఫ్‌జాన్" అంటారు. ఆమెకూ అమ్మాయిలకీ మధ్య మనస్పర్థ లేమీ లేవు. రెసా ఎప్పటిలాగే, వాళ్ళయెడల ఔదార్యంతోనే వ్యవహరించింది. వెనకటిలాగే, దుకాణానికి యాధాలాపంగానే వెళ్ళిందిగాని పనిగట్టుకుని వెళ్ళలేదు. విన్నీని కూడా తీసుకుపోయింది. అమ్మాయిలు ఆ జాకెట్టు చక్కదనాన్ని వర్ణిస్తూ ముగ్ధులైపోయారు. ఇది ప్రత్యేకమైనది. "అమ్మగారు తొడుక్కుని అద్దంలోచూసుకుని మరీ నిర్ణయించాలి. ముందే సరే అనకూడదు."

టెరెసా ఇష్టం లేకపోయినా అద్దంలో చూసుకోవలసి వచ్చింది. లేడిచర్మం, ముఖమల్ ఆకుపచ్చ. లాభంలేదు, నీ వంతు ఇంకెన్నడూ రాదు.

టెరెసా అంటుంది, "బాగానేఉంది. కాని నాకు బాగుండదు,"

"చాలా బాగా సరిపోయిందమ్మగారూ,"

"కావచ్చు, కాని నే నన్నట్టు నాకు బాగుండదు. సరేగాని, అసలిక్కడ మనకేం పని ? నాకు జాకెట్టే అక్కర్లేదే."

"అక్కర్లేదేవిటి ? ఒక్కసారి చూడిది. అయినా అది కొనదానికి నీకు తాహతుంది," అంది విన్నీ.

"తాహతు సంగతి ఎవరెత్తారు ?" అంది రెసా. డబ్బిచ్చేది తను. అమ్మే అమ్మాయి తెలివిగా సూచిస్తుంది.

"పోనీ ఆ అమ్మాయిగారు తొడుక్కుచూస్తే."

అప్పుడు తను అనుకున్నదానికి విరుద్ధంగా విన్నీ అది తొడుక్కుచూస్తుంది. ఈలోగా రెసా ఇతరవస్తువులు పరిశీలిస్తుంటుంది. తిరిగి వస్తుంది. అద్దంలో విన్నీని చూస్తుంది, తన్ను చూసుకుంటుంది. జాకెట్టు తీసుకుంటుంది. అంత చిరాకుగానూ కాదు, అంత మెత్తగానూ కాకుండా అంటుంది, "ఇంకచాలు ఈ అర్థంలేని నాటకం. నేను చెప్పనే చెప్పాను, జాకెట్టు నాకు సరిపోదని, ఇంక నీకంటావా? కుర్రపిల్లవి. కాస్త పెరిగేదాకా ఇది నీకు సరిపోదు." రెసా విన్నీని "కుర్రపిల్లవి" అంటుంది.

ఈ విధంగా విన్నీని మందలించేటప్పుడు, ఆమె గొంతు ఏమీ మారినట్టే కనిపించదు. ఆ గొంతులో అనురాగం లేదని అనలేం. అనురాగానికి అర్హతలేని గొంతుకనీ అనలేం. కాని కొంచెం చూచాయగా ఆ గొంతులో ఒక ధ్వనిఉంది— "అది తధ్యమనుకోడం పొరపాటు," అన్నప్పుడు తన గొంతులో మోగిన ధ్వని. ఆమాట అనాలని అనుకోకండానే అనేసింది రెసా.

అంచేత అది కొనడం జరగలేదు. రెసా కార్లో ఎక్కుతూ అంది, "నువ్వే నడుపు కారు. ఈ జాకెట్టుమీద డబ్బు తగలేసే బదులు, నది అవతలికి వెడదాం. సుమ్మాపుంట్ వరకూ." ఇప్పటి గొంతులో ఇందాకటి ధ్వని ఏమీ లేదు. అయితే మగురా వంతెనదాకా వెళ్ళేసరికి రెసాకి, తన పైకోటు "గెఫ్‌జాన్" లో మరిచిపోయిన సంగతి గుర్తుకొచ్చింది. వెంటనే విన్నీతో. "మరేం ఫరవాలేదు, రేపు తీసుకుంటాలే," అంది. అయితే సుమ్మాపుంట్‌లో సాయంకాలం అయిన కొద్దీ చలిగా ఉంటుంది, ముఖ్యంగా ఆరుబయట కూర్చోవాలంటే. ఈ విషయం జ్ఞాపకంచేస్తూ విన్నీ కారు వెనక్కి తిప్పింది. తిప్పుతూ రెసాతో అంది, "మనకి కావలసినంత టైముంది. మూసేదాని కింకా చాలా వ్యవధి ఉంది."

"గెఫ్‌జాన్" అప్పటికి మూసి ఉన్నట్టయితే ఇన్ని గొడవలు జరిగేవి కావు. దుకాణం ఇంకా తెరిచే వుంది. రెండోద్వారం దగ్గర దిగి— ఆ ద్వారం సామాన్యంగా ఎవరూ ఉపయోగించరు— రెసా చెల్లెలితో అంది, "నువ్వు కార్లోనే కూర్చో. ఇప్పుడే వస్తా," రెసా తొందరగా వెళ్ళాలి. కింది అంతస్థు అంతా నడిచి లిఫ్ట్ దగ్గరకు చేరుకోడమంటే ఆలస్యమౌతుంది. అంచేత ఎవ్వరూ ఉపయోగించని మెట్లెక్కి వెళ్ళింది, పై అంతస్థుకి. ఎవ్వరూ ఆమెను చూడలేదు.

ఒత్తైన తివాసీమీద ఆమె కాళ్ళచప్పుడు ఎవ్వరికీ వినబడలేదు. చుట్టూ చూసింది. ఎవరన్నా అడిగితే తను వచ్చిన పని చెప్పొచ్చునని. అద్దాల మధ్య నుంచి వేగంగా నడుస్తూ వెళ్ళింది. షో కేసులమధ్య నుంచి నడిచింది—మరింత వేగంగా. తలుపుల్లేని దుస్తుల బీరువాలమధ్యనించి గబగబ వెళ్ళింది. అక్కడికి చేరుకుంది. చూడగానే తనకోటు కుర్చీచేతిమీద కనబడింది, తనెక్కడ వదిలేసిందో అక్కడే. రెసాకి అన్నీ స్పష్టంగా గుర్తున్నాయి. ఒక్క అడుగు అవతల అద్దాల షెల్ఫ్ మీద పరిచిఉన్న ఆకుపచ్చ జాకెట్, అల్లాగే ఉంది. అమ్మే అమ్మాయి దాన్ని లోపల పెట్టలేదు. రెసా ఆగింది తనకోటు గబుక్కున తీసుకుని చేతిమీద వేసుకుంది. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ అంతస్థులో ఎవరూ లేరేమో అన్నట్టు. రెసా సందేహించ లేదు. వెనక్కి తిరిగి చూడలేదు. ఎవ్వరూ లేరు చుట్టు పక్కల. ఒక్క గొంతు వినబడలేదు. రెసా తనకోటు కుర్చీమీద పారేసింది మళ్ళీ. జాకెట్టు తొడుక్కుంది. వేసుకుంటుంటే చల్లగా తగిలింది ఒంటికి. దానిమీద తనకోటు తొడుక్కుంది. మెడ దగ్గర కోటు కాలర్ పైకి ఎత్తింది. ఎక్కడా ఆమె చేతల్లో జంకు లేదు. ఆమె కాళ్ళు తమంత తామే వెనక్కి అడుగులు వేశాయి, నిశ్శబ్దంగా. మెత్తని తివాసీలో మునిగిపోయినట్టుగా. ఆ తరవాత మెరుగుపెట్టిన చప్టామీద టకటక మోగాయి అడుగులు — కొద్దిక్షణాలే. దూరంగా దూరంగా, ఆ అంతస్థు చివరి కొచ్చేసింది. లిఫ్ట్‌కి ఎదురుగా. ఆమె ఆగగానే లిఫ్ట్ తలుపు తెరుచుకుని ఒక మనిషి వచ్చాడు. పక్కకి జరిగి నిలబడ్డాడు, ఆమె లోపలి కెళ్ళడానికి. కొంచెం తలవంచాడు మర్యాదగా. ఒంటిచేతి మనిషి. యూనిఫారం తొడుక్కున్నాడు. ఒక కోటుచెయ్యి వదులుగా జేబులోకి నొక్కేసి ఉంది. ఒంటి చెయ్యి లిఫ్ట్ నడుపుతుంది. జారుడు తలుపు క్లిక్ మంది. "కింది అంతస్థుకా అమ్మగారూ !" అన్నాడు. ఔనన్నట్టు తల ఊపింది రెసా. లిఫ్ట్ 'హుం' అంటుంది. రెసా కిందికి కిందికి దిగిపోయింది. తలుపు మళ్ళీ తెరుచుకుంది. గాలి. రెసా ఆరుబయట నిలబడింది. అయితే నే నసలు ఏం చేసినట్టు ? అనుకుంది. ఏమి టీ వెర్రిపని ? అనుకుంది. అయినా రెసా తన్నుతాను ఊహించుకుంది. తన దృష్టిలో. మగురా వంతెనదాకా వెళ్ళాక, లేకపోతే సుమ్మాపుంట్‌కి తిరిగే వంకర రోడ్డుమీద కారు తిరుగుతుండగా తన కోటు విప్పేస్తుంది. యాదాలాపంగా విన్నీతో, "ఎందుకాశ్చర్యం ? అవును. ఆఖరికి తెగించేశా." అంటుంది.

ఈ లోగా పోలీసు అధికారి రశీదులు సిద్ధం చేశాడు. అవి జాగ్రత్తగా ఒక కవరులో కూడా పెట్టాడు. రెసా కిచ్చాడు. రెసా వాటిని తన చేతి సంచిలో పెట్టుకుంది. చేతిసంచీ మూసింది. అక్కణ్నుంచి పారిపోవాలనిపించింది ఆమెకు. తొందరగా అలిసిపోయిందామె. తల తిరుగుతోంది. అక్కణ్నించి పారిపోవాలి. కాని పోలీసు అధికారి పిల్చాడు. "క్షమించండి. మీ రిది మరిచిపోయారు. మీ జాకెట్టు ఒదిలేశారు. ఈ జాకెట్టు మీ సొత్తు." "ఆ జాకెట్టు మీ యిష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. అయిన గొడవ చాలు." అంటుంది రెసా.

"అది మే మేం చేసుకుంటాం? ఆ దుస్తుతో మాకేమీ పనిలేదు." అంటాడు అధికారి. "అదీగాక అది ఫైల్లోకన్నా ఎక్కలేదు." అంటాడు చమత్కారంగా.

"నన్ను బలవంత పెట్టడం మీ అభిప్రాయం కాదుగా."

"ఎల్లా పెట్టగలం? కాని మీ రొదిలేస్తే జాకెట్టు మీకు పోష్టుద్వారా అందుతుంది. పోష్టు ఖర్చులు మీ రిచ్చుకోవాలి."

రెసాకి చిరాకు తలకెక్కింది. ఆపుకోలేక అంది, "మీ యిష్టం వచ్చినట్టు చెయ్యండి. ఇంటిదగ్గరై తే కత్తిరుంది, దీన్ని ముక్కలుముక్కలుగా కత్తిరించ డానికి. హాయిగా ఉంటుందప్పుడు."

"చాలా విచారకరమైన విషయం, ఇంత ఖరీదయిన వస్తువుని అలాచేస్తే.

"మీకు బహుమానంగా యిస్తాను. ఇంకెవరికన్నా ఇవ్వండి మీ యిష్టం వచ్చినట్టు చెయ్యండి."

"అబ్బే, అది రూల్సుకి వ్యతిరేకం. అయితే యిది మీరు బహుమానంగా ఇవ్వడానికి నిశ్చయించుకుంటే, ఒక అవకాశముంది. రెడ్‌క్రాస్ విషయం మీరు ఆలోచించండి మరొక రశీదు ముడుతుంది మీకు — వస్తురూపమైన విరాళం, సంతకం. రశీదూ ఇదీ మార్చుకోవచ్చు."

"రశీదు రాయించండి. కొంచెం తొందరగా."

రెసా, "దయచేసి తొందరగా చేయించండి." అంటుంది.

అయితే పని తొందరగా జరగదు. ఇంతలో ఎవరో వచ్చారు, ఏదో జరుగురు పనిమీద. ఆ తరవాత టెలిఫోన్ మోగుతుంది. పోలీసు అధికారి పెట్టేసిన తరవాత మళ్ళీ మళ్ళీ మోగుతుంది ఫోను. అప్పుడు అధికారి రెసాని అడుగుతాడు, "మీరు దిగివెళ్ళిన కారులో ఒక యువతి ఉందికదూ? బంధువా?"

"అయ్యో దేవుడా," అనుకుంది రెసా. "ఆ సంగతంతా మరిచేపోయాను. అదోగొడవ. సరే ఆ కారిప్పుడేమయింది?"

"కంగారు పడకండి. దురదృష్ట వశాత్తూ మీరా బంధువుకి కారు తాలూకు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. మగురా వంతెనమీద ఒక పోలీసు ఆపేశాడు. ఆ అమ్మాయి దగ్గర కాగితాల్లేవు, మీ కోసం వెతికారు. మీ రింటి దగ్గర లేరు. ఆ కాగితాలన్నీ మీ దగ్గరున్నట్టున్నాయి?"

"ఆ ఉన్నాయి."

"అయితే మీ బంధువుని జామీనుమీద మీరే విడిపించాలి."

"మరో విషయం. మిమ్మల్నిక్కడ నిర్బంధించినట్టు మీ బంధువుకి తెలియనివ్వం."

టెరెసా కారు అక్కడే గనక నిలబడి ఉంటే, ఎక్కడ తను దిగిందో అక్కడే ఉంటే, — పైగా "ఒక్క నిమిషం", అని అందికూడా.—ఆ మూల తిరగ్గానే టెరెసాకి కారు కనిపించకపోయేసరికి కంగారుపడకండా ఉన్నట్టయితే — ఇదంతా జరిగేది కాదు. కారు కనబడక పోయేసరికి ఆమె గుండె జారిపోయింది, అసలు అప్పుడే దొంగతనం చేసిన వ్యక్తికి గుండె అనేది ఉంటే గదా. వంటి మీద ఆకుపచ్చ జాకెట్టు, పైకోటు చేత్తో దగ్గరగా పట్టుకుంది. ఒక్కటే కోరి కామెకు, ఎక్కడో దాక్కోవాలి, ఎవరికీ కనబడకండా. ఎక్కడో, తొందరగా, దాక్కోవాలి. అంతటితోపోతే బాగుండును. పీడకల్లో జరిగినట్టు జరిగింది అంతా. అవతల, రోడ్డుకి అవతలప్రక్కని, ఎవరో నిలబడి ఉన్నారు. నిలబడ్డ ధోరణి చూస్తే ఏదన్నా వాహనం కోసం వెతుకు తున్నట్టుంది. కాదు. ఎవరినో వెనక పక్క నించి పరకాయించి చూస్తున్నట్టు. ఎవరినో, అప్పుడే వెళ్ళిన వ్యక్తినో, కారునో చూస్తున్నట్టు. అంతలో వెనక్కి తిరిగా డతను. ఫాల్నర్! 'పాపం' అంటుంది విన్నీ అతన్ని గురించి, జాలిపడుతూ. అతను వచ్చినప్పుడు తను ఇంట్లో లేదని. అతను వెనక్కి తిరిగాడు. చూసిం తరవాత ఆమెను గుర్తుపట్ట కండా ఎల్లా ఉంటాడు? టెరెసా వంటిమీద ఆకుపచ్చ లేడిచర్మం జాకెట్టుంది. ఆమె ఆగింది. అతనిలాగే ఆమెకూడా వెనక్కి తిరిగిచూసింది. అతను చెయ్యి ఊపాడు. ఇప్పుడింక మరో మార్గం లేదు. లోపల ఆకుపచ్చ జాకెట్టు కనబడ కండా ముడుచుకుంది వెనక్కి తిరిగి ద్వారం గుండా లోపలికి వెళ్ళింది. వరండా

దాటి కొద్ది మెట్లెక్కింది. కంగారుగా ఊపిరందకండా అక్కడ నిలబడింది. సరిగ్గా పట్టుపడ్డానికి అనువైనచోట నిలబడింది.

అంతక్రితమే టెరెసా చెల్లెలితో, "అది తథ్యమనుకోడం పొరబాటు" అంది. ఆ మాట అనకండా ఉన్నట్టయితే విన్నీ కూడా ఆమె మాట దాటేది కాదు. ఆ మాటను గురించి ఆమె పట్టించుకునేది కాదు. అంతేకాదు. సంతోషంగా, కార్లో, అక్కగారి కోసం కాచుకుని కూర్చునేది, ఆ ప్రదేశంలోనే. శ్రీయుత ఫాల్నర్ ఆమెను చూసి చెయ్యి ఊపేవాడు. రోడ్డు కడ్డంగా నడిచివచ్చేవాడు. హాయిగా సీట్లో వెనక్కు జేర్లబడి, అతడితో కబుర్లు చెపుతూ కూర్చునేది, అక్కగారు వచ్చేదాకా. అల్లా జరగలేదు. విన్నీకి చటుకుని చిరాకు పుట్టుకొచ్చింది. ఇంకా చిన్నపిల్ల. తిక్కగా కూచుంది. అనుకోకండా పచ్చదీపం వెలిగింది. కార్లు వరసగా కదలడం మొదలెట్టాయి. ఆమెకూ అవతలపక్క నిలబడ్డ మనిషికీమధ్య కార్లు అడ్డొచ్చాయి. ఎంతసేపటికీ కార్ల ప్రవాహం ఆగలేదు. కారుని పసుపు గీత మీదుగా ఆ ప్రవాహంలోకి తిప్పడానికి అవకాశం దొరికింది. ఆ తరవాత ఆప డానికి వీల్లేకపోయింది. కార్లప్రవాహంలో పోవలసివచ్చింది, గమ్యస్థానం లేకండా. మళ్ళీ వెనక్కి ఎల్లా తిరగాలో ఆమెకు తెలియలేదు. ఆ తరవాత వంతెన మీద పోలీసు ఆపేశాడామెను—ఆమెవద్ద కాగితాలు లేవని.

ప్రతి విషయంలోనూ పోలీసులు అతి మర్యాదగా ప్రవర్తించారు. విన్నీని ఊరికే గట్టిగా హెచ్చరించి ఒదిలేశారు. రెసా వద్దనించి రెడ్‌క్రాస్‌కి విరాళం ముట్టింది, డబ్బురూపంగానూ, వస్తురూపంగానూ. అంతా సులువుగా జరిగి పోయింది. పోలీసు రికార్డులలోకి ఏదీ ఎక్కలేదు. రెసా ఉద్యోగం వదిలెయ్య వలసిన అగత్యం లేదు. అంచేత ఆమె ఉద్యోగానికి రాజీనామా యిచ్చి, మరో శాఖలో చేరేసరికి. అందరికీ ఆశ్చర్యం కలిగింది "వాతావరణం మార్పుకావాలి. మారవలసిన అవసరం ఉంది." అంది రెసా. అంత సమర్థురాలైన ఉద్యోగిని సామాన్యంగా అధికారులు వదలిపెట్టరు. కాని టెరెసా మారుతున్న శాఖలో ఎంతో నమ్మకమైన వ్యక్తులు కావాలి. రెసా ఏ గొడవా లేకండా అన్నీ ఏర్పాటు చేసుకుంది. ఒక్కటే ఆమె ఆదుర్దా. తన దరఖాస్తు ఇటో అటో తేలేవరకూ ఈ రహస్యం బయట పడకూడదు. "స్వస్తి" అంది రెసా అప్పుడు, "లేడి చర్మాలకు స్వస్తి. నిజమే. కొంత వయస్సు ముదిరింది. వేళ్ళన్నీ

ఎప్పుడో ఒకప్పుడు చచ్చిపోతాయి. అయినా అంత వయస్సు ముదరనూ లేదు.''

ఏర్పాట్లన్నీ పూర్తయిపోయాయి. అప్పుడే తెలిసింది తోటి ఉద్యోగులికి ఆమె మారుతున్నట్టు. వేసవి విందులో ఆమె ఒక బల్లదగ్గర కూర్చుంది. చీకటి పడ్డకొద్దీ విందు కాస్త హుషారుగా మారుతోంది. అయితే రెసా, ఇంకా రెసా తన ఆకుపచ్చ జాకెట్టుని వొదుల్చుకోలేకపోయింది. ప్రతి ఏడూలాగే వేలం ప్రారంభమైంది. బహుమతులు ప్రదర్శించే ముందు, మిగిలిపోయిన టిక్కెట్లు వేలం వేస్తారు. వేలం పద్ధతి ఎలా వుంటుందంటే, పాడే వ్యక్తి టిక్కెట్టు విలువ కన్నా ఎక్కువ కట్టాలి. ఆ విధంగా రెడ్‌క్రాస్ సంస్థకి చాలా డబ్బు ముడుతుంది. ఆఖరుకి బహుమతు లెవరికొచ్చాయో తెలియజేశారు. విలువైన బహుమతు లెన్నోవున్నాయి కొన్ని బహుమతులు చూసుకుని గెల్చుకున్నవాళ్ళు నవ్వుకుంటారు.

ఆఖరికి ముఖ్యవస్తువు ప్రదర్శించారు. చూడముచ్చటైనది. ఒక జాకెట్టు. ఆకుపచ్చనిది లేడి చర్మంతో కుట్టినది. అందరూ మెచ్చుకున్నారు దాన్ని చూసి. నెగ్గిన వ్యక్తిని చూసి అసూయపడ్డారు. అప్పుడే వేలం వేసిన అధికారి రెండు మూడుసార్లు నెగ్గిన సంఖ్య పిలిచాడు "అది సరిగ్గా....!'' అంది విన్నీ, ''చూడు రెసా, అది సరిగ్గా....'' కాని రెసా అక్కడ కూర్చుని లేదు చేతులో వున్నదేదో నలిపిపారేసింది. లేచి మనుషుల వరసల మధ్య నించి నడుస్తూ వెడుతోంది. ముఖం నల్లబడింది. అలంకరించబడ్డ ఆ హాలు వదలి వెళ్ళిపోయింది.

''ఏమిటల్లా తెల్లబోయిచూస్తున్నావు?'' అన్నాడు ఫాల్నర్, విన్నీ పక్కని కూర్చుని. కిందపడ్డ చీటీ తీశాడు, విప్పి సాపు చేశాడు. విన్నీతో అన్నాడు. "తొందరగా వెళ్ళి చెప్పుకో. తెలీటంలే–ఇది నీదే.''

''చాల్లే. అది రెసా టిక్కెట్టు,'' అంది విన్నీ కంగారుపడుతూ. అతని దగ్గరనుంచి లాక్కుంది టిక్కెట్టు.

ఈ లోగా ఎల్లాగో రెసా వేదికమీద ప్రత్యక్షమైంది. ఆ వస్తువు తీసుకుంది. అందరూ చప్పట్లు కొడుతుంటే తిరిగి వచ్చింది, చేతిమీద ఆ జాకెట్టు వేసుకుని. ''నిజమే.'' అంది ఆమె.

"నాదే సంఖ్య. అది నా సైజేకూడా. అయితే నాసామానంతా సర్దేశాను. నీకు," విన్నితో చెప్పింది రెసా, "నీకూ సరిపోతుందిది. తొడుక్కో. ఇదివర కొకసారి తొడుక్కుచూశావుగా."

"తొడుక్కుచూసిందా? ఏవిఁటి నువ్వనేది?" అన్నారు బల్లచుట్టూ ఉన్న వాళ్ళు.

"ఏదో గొడవలెండి," అంది రెసా సిగరెట్టుతీస్తూ, "అయితే ఆ రహస్యం ఎన్నటికీ బయటికి రాదు."